


సబ్‌జైలులో జిల్లా జడ్జి తనిఖీ

వినుకొండ(నూజెండ్ల): వినుకొండలోని సబ్‌జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.వి.పార్థసారథి, డీఎల్ఎస్ఏ జడ్జి టి.లీలావతి తనిఖీ చేశారు.



బంగారు హారం వితరణ

వినుకొండ(నూజెండ్ల): ఏనుగుపాలెంరోడ్డులోని అంకాలమ్మ తల్లికి చిట్టూరి వెంకట రవి. పద్మావతి కుటుంబసభ్యులు రూ.2.50 లక్షల విలువైన బంగారు హారం అందించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 580.70 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 7,578 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరుని సేవలో ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ



అమరావతి: పంచారామ క్షేత్రాల్లో ప్రథమారామమైన అమరావతిలో వేంచేసి ఉన్న బాలచాముండికా సమేత అమరేశ్వరుడిని ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ మహేష్ చంద్ర లడ్హా కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ అర్చకులు వేదపండితులు మహేష్ చంద్ర లడ్హాను ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన కుటుంబ సమేతంగా అమరేశ్వర స్వామికి అభిషేకాలు, బాలచాముండేశ్వరి దేవికి అష్టోత్తర కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం మహేష్ చంద్ర లడ్హాకు వేదపండితులు, అర్చకులు ఆశీర్వచనం అందించారు. స్వామి శేషవస్త్రంతోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు.

బావుడా అభివృద్ధికి కృషి

కొత్త చైర్మన్ రాజశేఖర్‌బాబు



బాపట్ల: బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా ఈ ప్రాంతాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సలగల రాజశేఖర్ బాబు పేర్కొన్నారు. బావుడా చైర్మన్‌గా రాజశేఖర్‌బాబు ప్రమాణస్వీకారోత్సవం ఆదివారం జరిగింది. జేసీ ప్రఖర్‌జైన్ రాజశేఖర్‌బాబుతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం బావుడా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఈ బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తానని, బాపట్ల ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మరాజు, ఏలూరి సాంబశివరావు, నక్కా ఆనంద్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు బాచిన చెంచుగరటయ్య, చీరాల గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

- భారీగా తరలివచ్చిన భక్తజనం
- ప్రత్యేక ఆకర్షణగా కళాకారులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ ఆదివారం తెల్లవారుజామున జరిగింది. దేవస్థాన ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణ సుమారు 8 కిలోమీటర్ల మేర సాగింది. తొలుత ప్రత్యేకంగా పూలతో అలంకరించిన రథంపై శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో కెఎస్.రామరావు కొబ్బరికాయ కొట్టి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాలు, సితార సెంటర్, కబేళా, పాలప్రాజెక్టు, కేఎల్‌రావునగర్, చిట్టినగర్, కేటీ రోడ్డు, నెహ్రూ బొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదగా అమ్మవారి ఆలయానికి ప్రదక్షిణ చేరింది. కూచిపూడి, భరతనాట్యాలను చిన్నారులు ప్రదర్శిస్తూ గిరి ప్రదక్షణలో పాల్గొనడం ప్రత్యేకతగా నిలిచింది.

• అమరజీవి అజరామరం



పల్నాడులో..

నరసరావుపేట: ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు తన జీవితాన్నే అర్పించారని పల్నాడు కలెక్టర్ పి.అరుణ్‌బాబు కొనియాడారు. అమరజీవి ఆత్మార్పణ దినం సందర్భంగా ఆదివారం పల్నాడు కలెక్టరేట్‌లో శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి కలెక్టర్ నివాళులర్పించారు. తెలుగు వారందరూ ఒకే చోట ఉండాలని కాంక్షిస్తూ శ్రీరాములు చేసిన త్యాగనిరతిని కొనియాడారు. డీఆర్వో ఎ.మురళి, ఆర్డీఓ కె.మధులత కలెక్టర్‌తోపాటు పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శంకరభారతీపురం విద్యార్థినులు అమరజీవిపై రూపొందించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.



గుంటూరులో..

పట్నంబజారు(గుంటూరు): ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని వైఎస్సార్ సీపీ నేతలు పేర్కొన్నారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు, పార్టీ నగర అధ్యక్షుడు, డెప్యూటీ మేయర్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు)లు ఆదివారం శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



బాపట్లలో..

బాపట్ల: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలను సాధిద్దామని జేసీ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక బాపట్ల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఉన్న ఆయన విగ్రహానికి జాయింట్ కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ అమరజీవి ఆశయాల కోసం యువత పనిచేయాలని పిలుపునిచ్చారు. పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థినులకు జేసీ బహుమతులు అందించారు.

అల్పపీడనంతో కలవరింత

అన్నదాతల్లో వణుకు

- వరుస వాయుగుండాలతో ఆందోళన
- కోతకు సిద్ధమైన వరిపైర్లు
- కోతలు కోసేందుకు మీమాంస

బాపట్లటౌన్: వరుస వాయుగుండాలు వాయగొడుతున్నాయి. ఫలితంగా అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పది రోజుల క్రితం ఫెంగల్ తుఫాన్ మిగిల్చిన నష్టం నుంచి తేరుకోకముందే మరో అల్పపీడనం ముంచుకొచ్చింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ అల్పపీడన ప్రభావంతో బాపట్ల తీర ప్రాంతంలో మబ్బులు కమ్ముకున్నాయి. ఈనెల 17 తర్వాత కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ప్రమాదముందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో వరి రైతులు తీవ్రంగా కలవరపడుతున్నారు. కోతలకు సిద్ధమైన పంటలను ఏం చేయాలో పాలుపోక విలవిల్లాడుతున్నారు. నెల రోజుల క్రితం వరకు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొని అష్టకష్టాలు పడి ఎలాగొలా పంటలు సాగు చేసిన రైతులను ఇప్పుడు వాయుగుండాలు వెంటాడుతుండడం గమనార్హం. ఇదిలా ఉంటే చలిగాలులకు వరి గింజలు రాలిపోవడం, ఏపుగా పెరిగిన పంట నేలవాలిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పుడు అల్పపీడనం భయంతో కొందరు కోతలు కోయాలా వద్దా అనే సందేహంలో ఉండగా, మరికొందరు ఇప్పటికే కోసి ఉన్న ఓదెలను పూర్తిగా ఎండక ముందే కట్టివేతలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తిగా ఎండకముందే కుప్పవేస్తే గింజ రంగుమారి దిగుబడి తగ్గే ప్రమాదం ఉన్నా.. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు కుప్పలు వేస్తున్నారు.



కర్లపాలెం మండలంలో ఓదెలపై ఉన్న వరిపంట

ముమ్మరంగా కోతలు

బాపట్ల మండలంలో ఈ ఏడాది 23,025 ఎకరాలు, కర్లపాలెం మండలంలో 16,700, పిట్టలవానిపాలెం మండలంలో 11,600 ఎకరాల్లో వరి సాగైంది. ఇప్పటికే పిట్టలవానిపాలెం మండలంలో అల్లూరు, అలకాపురం, గోకరాజు నల్లిబోయినవారిపాలెం, ఖాజీపాలెం, చందోలు, నదిముల్లాయపాలెం, పిట్టలవానిపాలెం, మంతెనవారిపాలెం గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల కోసిన వరి పనలు కల్లాల్లోనే ఉన్నాయి. ఇదిలా ఉంటే 1500 ఎకరాల్లో యంత్రాలతో నేరుగా ధాన్యం నూర్పిడి చేశారు.

- కర్లపాలెం మండలంలో పెదగొల్లపాలెం, పేరలి, ప్యార్లిపాడు, చింతాయపాలెం, గణపవరం, నల్రావారిపాలెం, తుమ్మలపల్లి, యాజలి, బుద్దాం గ్రామాల్లో ఇప్పటివరకు సుమారు 2 వేల ఎకరాల కుపైగా కోతలు జరిగాయి. 500 ఎకరాల్లో వరి యంత్రాలతో ధాన్యం నూర్పిడి చేశారు. మిగిలిన ప్రాంతాల్లో పంట కోతకు సిద్ధంగా ఉంది.



పిట్టలవానిపాలెం మండలంలో కట్టివేతలు వేస్తున్న రైతులు

- బాపట్ల మండలంలోని ఈస్ట్ పిన్నిబోయినవారిపాలెం, వెస్ట్ పిన్నిబోయినవారిపాలెం, చుండూరుపల్లి, ఈతేరు, గుడిపూడి, భర్తిపూడి, నేరుడుపల్లి, అప్పికట్ల, మర్రిపూడి, ఈస్ట్ బాపట్ల, వల్లువారిపాలెం గ్రామాల్లో సుమారు 1,000 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. మిగిలిన గ్రామాల్లోని పొలాలు కోతకు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు పడితే పైర్లు నేలవాలిపోతాయని, ఓదెలపై ఉన్న గింజలు మొలకలు వస్తాయని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉంటే వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల మూడు రోజులపాటు రైతులు కోతలను వాయిదా వేసుకోవాలని అధికారులు సూచించారు.

గుంటూరు జీజీహెచ్‌లో మరో భవనం





పైలాన్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, డాక్టర్ పాదిల ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రూ. 10 కోట్లతో నిర్మాణానికి శంకుస్థాపన

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని డాక్టర్ పాదిల ప్రసాద్ జింకానా సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో జింకానా సహకారంతో రూ. 10 కోట్ల వ్యయంతో అదనంగా రెండు అంతస్తుల భవనం నిర్మించనున్నారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా శంకుస్థాపన పనుల పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ.. ఒక డాక్టర్‌కు మెడలో స్టెతస్కోప్ ఎలా ఉంటుందో, గుంటూరు జీజీహెచ్‌కు జింకానా సేవలు ఒక మణిహారంలా ఉన్నాయని చెప్పారు. జింకానా డోనర్స్ సభ్యులను అభినందించారు. జింకానా సభ్యుల విరాళాలు రూ. పది కోట్ల వ్యయంతో రెండు అంతస్తుల నిర్మాణం, రూ.వంద కోట్లతో తల్లీపిల్లల విభాగం, నాట్కో సహాయంతో క్యాన్సర్ వార్డు నిర్మాణం తదితర పనులు జరుగుతున్నాయని తెలిపారు. గుంటూరు వైద్య కళాశాలలో చదివిన వారు జింకానా పేరుతో తమ కళాశాల అభివృద్ధికి చేస్తున్న సేవలు దేశవ్యాప్తంగా ఆదర్శనీయమని చెప్పారు. వీరికి డాక్టర్ పాదిల ప్రసాద్ నేతృత్వం అభినందనీయం అని వెల్లడించారు. డాక్టర్ పాదిల ప్రసాద్‌కు, జింకానా సభ్యులు, బిల్డింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ సాగి రెడ్డి బాబురెడ్డికి గుంటూరు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. విరాళాలను సక్రమంగా ఉపయోగించేలా చూస్తామన్నారు. డాక్టర్ పాదిల ప్రసాద్ మాట్లాడుతూ.. కన్నతల్లి, జన్మభూమికి ఎంత ఇచ్చినా రుణం తీరదని పేర్కొన్నారు. జింకానా విజయవంతం వెనుక పటిష్టమైన వ్యవస్థ కారణమని తెలిపారు. జింకానా కోఆర్డినేటర్లు డాక్టర్ నూతక్కి వేంకటేశ్వరరావు, డాక్టర్ బసవ పున్నయ్య, డాక్టర్ ప్రభాకరరావు, డాక్టర్ బాల భాస్కర్‌రావు, డాక్టర్ హనుమంతరావుల సేవలను అభినందించారు. రూ.10 కోట్ల విరాళంలో డాక్టర్ పాదిల ప్రసాద్ రూ.రెండున్నర కోట్లు ఇవ్వగా, జింకానా సభ్యులు మిగిలిన మొత్తం ఇచ్చారు. అనంతరం ప్రసాద్‌ను కేంద్ర మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్ బాబు, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, చైర్మన్ బిల్డింగ్ కమిటీ యూఎస్ఏ జింకానా డాక్టర్ సాగిరెడ్డి బాబురెడ్డి, నాట్కో వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు, తులసీ సీడ్స్ అధినేత శ్రీ రామచంద్ర ప్రభు, టీడీపీ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీఎల్ఐడీసీ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యాని, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. వి.సుందరాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వి.సతీష్‌కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, సీఎంఓహెచ్ఓ డాక్టర్ శోభారాణి, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, డాక్టర్ సయ్యద్ రసూల్, కార్పొరేటర్లు ముత్తినేని రాజేష్, పోతురాజు సమత తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన గుంటూరు జిల్లా ఎడ్లు

బండలాగుడు పోటీల్లో ప్రథమ స్థానం



పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టులో వెలసిన కాశినాయన 29వ ఆరాధన మహోత్సవం సందర్భంగా ఆదివారం తెలుగు రాష్ట్రాల స్థాయి పెద్దసైజు బండలాగుడు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. గుంటూరు జిల్లా కుంచనపల్లి గ్రామానికి చెందిన పీఆర్ మెమోరియల్ ప్రలగం ప్రతిజ్ఞరెడ్డి, జస్వితరెడ్డి ఎడ్ల జత 1,845 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచింది. ఈ ఎడ్ల జతకు కృష్ణా జిల్లా మైలవరం గ్రామానికి చెందిన శ్రీలం హరీష్‌రెడ్డి, ఐలూరి మురళీకృష్ణారెడ్డి రూ.60,116 నగదు బహుమతిగా అందజేశారు. బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన వీరాస్వామిచౌదరి ఎడ్లజత 1,800 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో నిలవగా, ఈ జతకు మార్కాపురం పట్టణానికి చెందిన దగ్గుల శ్రీనివాసరెడ్డి, దరిమడుగు గ్రామానికి చెందిన ముదిరెడ్డి శ్రీనివాసరెడ్డి రూ.50,116 అందించారు. నంద్యాల జిల్లా కుంపరమాను దిన్నె గ్రామానికి చెందిన కుందురు రాంభూపాల్‌రెడ్డి ఎడ్లజత 1,640 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం, నంద్యాల జిల్లా జిల్లెలగోస్పాడు గ్రామానికి చెందిన గారటికె నాగిరెడ్డి ఎడ్లజత 1626 అడుగుల దూరం లాగి నాలుగో స్థానం, మార్కాపురం మండలం బొడిచర్ల గ్రామానికి చెందిన తిండి నక్షత్రరెడ్డి ఎడ్ల జతలు 1,620 అడుగులు, 1,092 అడుగుల దూరం లాగి ఐదు, ఆరో స్థానంలో నిలిచాయి.

తపాలా శాఖలో 'పని సంస్కృతి' కొనసాగాలి



ప్రసంగిస్తున్న డీవీఎస్సార్ మూర్తి

పోస్ట్ మాస్టర్ జనరల్ డీవీఎస్సార్ మూర్తి

తెనాలి: తపాలా శాఖలో ఇప్పుడున్న పని సంస్కృతిని ఉద్యోగులు కొనసాగించాలని పోస్ట్ మాస్టర్ జనరల్ (విశాఖ, విజయవాడ రీజియన్లు) డీవీఎస్సార్ మూర్తి సూచించారు. భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సర్కిల్ గ్రూప్-సీ, పోస్ట్‌మ్యాన్ అండ్ ఎంటీఎస్ అండ్ బీజీడీకేఎస్ (జీడీఎస్) తృతీయ సమావేశాలు ఆదివారం ఘనంగా జరిగాయి. కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో ఏర్పాటైన ఈ సమావేశాలకు గ్రూప్-సీ ఏపీ సర్కిల్ అధ్యక్షుడు ఈ.హనుమంతరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా డీవీఎస్సార్ మూర్తి మాట్లాడుతూ.. టెక్నాలజీ, ప్రైవేటు కొరియర్ సర్వీసుల పోటీని తట్టుకుని తపాలా శాఖ నిలబడటం గొప్ప విషయమన్నారు. ఉద్యోగుల అంకితభావం ఇందుకు కారణమన్నారు. గ్రూప్-సీ ఏపీ సర్కిల్ ప్రధాన కార్య దర్శి సీహెచ్ వెంకయ్య మాట్లాడుతూ రెండేళ్ల వ్యవధిలో అసోసియేషన్ ఏడు డివిజన్ల నుంచి 24 డివిజన్లకు విస్తరించినట్టు చెప్పారు. కార్యదర్శి నివేదికను వివరించారు. సమావేశంలో భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనంతకుమార్ పాల్, పోస్టుమ్యాన్ అండ్ ఎంటీఎస్ ఏపీ సర్కిల్ అధ్యక్షుడు జి.బ్రహ్మయ్య, జీడీఎస్ ఏపీ సర్కిల్ అధ్యక్షుడు ఎ.వెంకటరామిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి సంతోష్‌కుమార్ సింగ్, పోస్ట్‌మ్యాన్ అండ్ ఎంటీఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఖైలీరామ్ శర్మ, బీజీడీకేఎస్ ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్, బీపీఆర్ఎస్‌పీ ప్రధాన కార్యదర్శి కాళిముత్తు కృష్ణమూర్తి తదితరులు మాట్లాడారు. తొలుత బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాయుడు సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు.

జూనియర్ ఫారెస్ట్ అధికారుల సంఘానికి నూతన కార్యవర్గం



గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ జూనియర్ ఫారెస్ట్ అధికారుల సంఘం గుంటూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా పి.సంతోష్‌కుమార్, వి.వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని కృషి భవన్‌లో ఆదివారం సంఘం గుంటూరు శాఖకు ఎన్నికలు నిర్వహించారు. కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గుంటూరు శాఖ ఉపాధ్యక్షుడిగా ఎన్.మోహన్‌రాజు, సంయుక్త కార్యదర్శిగా షేక్ అమీర్‌జానీ బాషా, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.వెంకయ్య, కోశాధికారిగా ఎస్.పురుషోత్తమరాజు ఎన్నికయ్యారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు శశిభూషణ్ యాదవ్, ప్రాంతీయ కార్యదర్శి రవీంద్ర ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు.



మహాగర్జన

గుంటూరు రూరల్: వర్గీకరణ క్రీమిలేయర్ విధానం ద్వారా మాలల అంతానికి రాష్ట్రంలో చంద్రబాబు, కేంద్రంలో మోదీ కుట్రలు పన్నుతున్నారని అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి దేవీ ప్రసాద్ విమర్శించారు. వర్గీకరణ, క్రీమిలేయర్ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గుంటూరు రూరల్ మండలం నల్లపాడులో రాష్ట్రస్థాయి మాలల మహాగర్జన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. జేఏసీ చైర్మన్ దేవీ ప్రసాద్ అధ్యక్షత వహించగా బీఆర్ అంబేడ్కర్ ముని మనుమడు యశ్వంత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై ధ్వజమెత్తారు. విజయవాడలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయటం సంతోషకరమన్నారు. ఆ విగ్రహం ఉన్న గ్రౌండ్‌ను కమర్షియల్‌గా మార్చేందుకు ప్రస్తుత సర్కారు కుట్ర చేస్తోందని విమర్శించారు.



క్లుప్తంగా

రాజ్యాంగం అమలుపై చర్చ మంచి పరిణామం



బాపట్ల: రాజ్యాంగం అమలుపై పార్లమెంటులో జరిగిన చర్చ ఆహ్వానించదగిన పరిణామమని అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ అన్నారు. ఆదివారం బాపట్ల 24వ వార్డు డ్రైవర్స్ కాలనీలో 'రాజ్యాంగం – భద్రత లేని పేదల బతుకులు' అంశంపై జరిగిన సమావేశంలో మేకల ప్రసాద్ మాట్లాడారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు అయిన సందర్భంగా పార్లమెంట్లో జరిగిన చర్చలో ప్రధాని మోదీ ప్రసంగించిన విషయాన్ని గుర్తు చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ నేతృత్వంలో రాజ్యాంగ కర్తలు అద్భుతంగా రాజ్యాంగాన్ని రచించారని పేర్కొన్నట్లు తెలిపారు. దాన్ని నెహ్రూ, గాంధీ కుటుంబం ఇష్టం వచ్చినట్లుగా మార్చేసిందని వ్యాఖ్యానించటం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టమొచ్చినట్లు చేస్తే, మోదీ ప్రభుత్వం కూడా అదే తరహాలో రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు హఫీజుల్లా, వి.రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో రోడ్డుపై గుంత పూడ్చివేత



పర్చూరు(చినగంజాం): పర్చూరు మండల పరిధి ఆదిపూడి గ్రామానికి చెందిన కాల్వ రఘురామయ్య సొంత ఖర్చుతో రోడ్డుపై గుంతను పూడ్చారు. ఆయన ద్విచక్ర వాహనంపై ఆదివారం పెదనందిపాడు నుంచి పర్చూరు వస్తుండగా అడుసుమల్లి దాటిన తరువాత బ్రిడ్జి మధ్యలో పెద్ద గుంతను గమనించారు. ఇనుప చువ్వలు బయటకు వచ్చి కనిపించాయి. వాహనదారులు ప్రమాదాల బారిన పడతారని గ్రహించిన రఘురామయ్య తన ద్విచక్ర వాహనాన్ని అక్కడే గుంతకు అడ్డుగా ఉంచారు. అక్కడి నుంచి బస్సులో పర్చూరు చేరుకొని సిమెంట్, ఇసుక కొనుగోలు చేసుకొని వెళ్లి కాంక్రీట్ కలిపి తీసుకొచ్చారు. గుంతను పూడ్చివేసి ఆదర్శంగా నిలిచారు. ఆయనను పలువురు అభినందించారు.

కృష్ణా నదిలో ఈత కొడుతూ వ్యక్తి మృతి



తాడేపల్లి రూరల్: కృష్ణా నదిలో ఈత కొడుతూ ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ టైమ్స్ హాస్పిటల్ దగ్గర నివాసముండే ఎం.సీతారామిరెడ్డి (58) ప్రతిరోజు ఈతకు కృష్ణానదికి వస్తాడని, రోజు లాగే ఆదివారం కూడా వచ్చి ఈదుతున్న సమయంలో గుండెపోటు వచ్చిందన్నారు. నీటిలో మునిగి మృతి చెందాడని తెలియజేశారు. కృష్ణానది ఎగువ ప్రాంతంలోని అమరావతి కరకట్ట వెంబడి పడవల రేవు వద్ద ఈ ఘటన జరిగిందన్నారు. ఈ సంఘటనపై బంధువులు తమకు ఎటువంటి కేసు అవసరం లేదని పోలీసులకు తెలిపారు.

ప్రజలను మోసగిస్తున్న కూటమి ప్రభుత్వం

అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్చార్జి పానెం చినహనిమి రెడ్డి



నాయకులతో మాట్లాడుతున్న పానెం చినహనిమి రెడ్డి

అద్దంకి రూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం మోసగిస్తోందని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్చార్జి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ఆయన నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతూ... కూటమి అధికారంలోకి వచ్చి 6 నెలలు దాటినా ఇంకా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, కక్ష సాధింపు చర్యలు ఆగలేదన్నారు. వాటిని మానుకొని పాలనపై దృష్టి పెట్టాలని పాలకులకు సూచించారు. రైతులను మోసగించి, నడిరోడ్డు మీదకు తెస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు జిల్లాల వారీగా రైతులకు మద్దతుగా నిర్వహించిన ర్యాలీలు విజయవంతం అయ్యాయని తెలిపారు. ప్రతి రైతు తన ఆవేదనను వ్యక్తం చేశారన్నారు. రైతులతోపాటు ఇతర అన్ని వర్గాల ప్రజలను కూటమి పాలకులు మోసం చేశారన్నారు. సూపర్ సిక్స్లో ఒక్కటి కూడా అమలు చేయలేకపోయినట్లు తెలిపారు. కరోనాతో తలెత్తిన ఆర్థిక సంక్షోభాన్ని సైతం సమర్థంగా ఎదుర్కొని వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన పాలనలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని గుర్తుచేశారు. వైఎస్ జగన్ పాలనలోనే హాయిగా ఉన్నామని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. మళ్లీ ఆనాటి పాలన కోసం ఎదురు చూస్తున్నామని చెబుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, కౌన్సిలర్ జి. కోటేశ్వరరావు, సర్పంచ్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళులు



నివాళులు అర్పిస్తున్న జెడ్పీ సీఈవో జ్యోతిబసు, అధికారులు, ఉద్యోగులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం జెడ్పీ సమావేశ మందిరంలో ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, జెడ్పీ ఇన్చార్జ్ అకౌంట్స్ అధికారి శామ్యూల్ పాల్, ఏవోలు, ఉద్యోగులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్కుమార్

నగరంపాలెం: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమరుడైన పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని జిల్లా ఎస్పీ సతీష్కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ (ఏఆర్) ఎ.హనుమంతు, ఎంటీ ఆర్ఐ శ్రీహరిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐస్ స్కేటింగ్ డే వేడుకలు



లక్ష్మీపురం: స్కేటింగ్ సాధనతో చిన్నారుల్లో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం పెరుగుతాయని ఆంధ్రప్రదేశ్ ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ సెక్రటరీలు షేక్ ఖాజా, అబ్దుల్ సలాం, నూరుద్దీన్లు అన్నారు. బ్రహ్మానంద రెడ్డి స్టేడియంలో ఆదివారం జాతీయ ఐస్ స్కేటింగ్ డే వేడుకలను ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చినవారు గంట పాటు స్కేటింగ్ చేశారు. అనంతరం క్రీడాకారుల విన్యాసాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు.

నసీర్ అహ్మద్కు జాతీయ సమైక్యత పురస్కారం

పిడుగురాళ్ల: పిడుగురాళ్లకు చెందిన రచయిత సయ్యద్ నసీర్ అహ్మద్ జాతీయ సమైక్యతా పురస్కారం అందుకున్నారు. అనంతపురం జిల్లాలోని చారిత్రక పెనుగొండ పట్టణంలో ఈ నెల 13న పెనుగొండ దర్గా పీఠాధిపతి తాజుద్దీన్ బాబా అధ్యక్షతన జరిగిన జాతీయ సమగ్రత–సమైక్యత, ఐక్యత సదస్సులో నసీర్ అహ్మద్కు జాతీయ సమైక్యతా పురస్కారాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు మహ్మద్ షరీఫ్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు నసీర్ అహ్మద్ తెలిపారు. జంపని ఆస్థాన అధినేత నిజాముద్దీన్తోపాటు పలు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

సినీఫక్కీలో గాల్లోకి ఎగిరిన కారు

యడ్లపాడు: సినీఫక్కీలో కారు గాల్లోకి ఎగిరి వంతెనపై నుంచి సర్వీసు రోడ్డుపై పడిన సంఘటన మండలంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కృష్ణా జిల్లా గన్నవరం మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన పులిపాక అజయ్ విజయవాడ నుంచి ఒంగోలుకు కారులో ప్రయాణిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి మండలంలోని వంకాయలపాడు సమీపంలోకి రాగానే అజయ్కు నిద్రమత్తుతో కారు అదుపుతప్పింది. దీంతో ఎక్స్ప్రెస్ హైవే పక్కనున్న గడ్డర్లకు ఢీకొని ప్రమాదం జరిగింది.

విద్యుత్ చార్జీలపై ప్రజల్ని వంచించిన కూటమి



రాష్ట్ర సర్కారు తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబురావు
- కరెంట్ బిల్లులను దహనం చేసి నాయకుల నిరసన

లక్ష్మీపురం: తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల్లో మాట ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు చార్జీలు పెంచి ప్రజల్ని వంచించారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు విమర్శించారు. బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయం వద్ద ఆదివారం విద్యుత్ బిల్లులను దహనం చేసి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలనలోనే రూ.15,486 కోట్ల భారం ప్రజలపై వేసిందన్నారు. 25 ఏళ్లపాటు రూ.1.10 లక్షల కోట్లను ప్రజల నుంచి వసూలు చేయటానికి రంగం సిద్ధం చేశారన్నారు. అభివృద్ధి అంటూ పేదలపైనే భారం మోపుతున్నారని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రతి ఇంటికీ రూ.10 వేలు చొప్పున 1.50 కోట్ల మంది వినియోగదారులపై మరో భారం మోపనున్నారని తెలిపారు. మోడీ ఆదేశాలతో అదానీని కాపాడే విషయంలో కూటమి పార్టీలు కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. ఒప్పందం రద్దు చేసుకుంటే రూ.3 వేల కోట్లు పెనాల్టీ చెల్లించాలని అబద్ధాలు చెబుతున్నారని, నయాపైసా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అదే నిజమనుకున్నా రూ.3 వేల కోట్ల పెనాల్టీ కోసం ప్రజలపై రూ.1.10 లక్షల కోట్ల భారం వేస్తారా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఇక అదానీ వైపు ఉంటుందో, ప్రజల వైపు ఉంటుందో తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ.. మంచి పాలన అందిస్తామని వాగ్దానం చేసిన కూటమి నాయకులు ఇప్పుడు మోసం చేస్తున్నారన్నారు. కేంద్ర సర్కారు మనుగడ టీడీపీపై ఆధారపడి ఉందని, ఇప్పటికైనా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు రాబట్టాలని, ప్రజల ఆకాంక్షలను ఆ పార్టీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు పాశం రామారావు, వై.నేతాజీ, కె.నళినీకాంత్, అప్పారావు, ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధస్తూపానికి నూతన సొబగులు



భట్టిప్రోలు బౌద్ధస్తూపం



ఆర్వో ప్లాంట్ నిర్మాణానికి జరుగుతున్న పనులు

- ఏఎస్ఐ కన్జర్వేషన్ అసిస్టెంట్ వెంకటయ్య
- ఆవరణలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు బౌద్ధస్తూపం అభివృద్ధి పనులను ప్రత్యేకంగా గానుగ సున్నంతో చేయిస్తున్నట్లు ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) కన్జర్వేషన్ అసిస్టెంట్ యు. వెంకటయ్య ఆదివారం చెప్పారు. నిర్మాణ పూర్వాకృతి కోల్పోకుండా మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ... అండర్ పోర్షన్ కోసం ప్రత్యేకమైన ఇటుకలను నాగార్జున సాగర్ నుంచి రప్పించామని తెలిపారు. సిమెంట్ వాడకుండా గానుగతో ఆడించిన సున్నంతో మరమ్మతులు చేయిస్తున్నట్లు వివరించారు. స్తూపం ఆవరణలోకి వచ్చే రహదారి ఇరుపక్కల చెట్ల చుట్టూ ఏర్పాటు చేసిన అరుగులు పగుళ్లు రావడంతో వాటిని తొలగించామని తెలిపారు. సందర్శకుల కోసం ప్రత్యేకంగా బల్లలు ఏర్పాటు చేశామన్నారు. బౌద్ధ స్తూపం చుట్టూ ఫెన్సింగ్ కట్టుదిట్టం చేస్తున్నట్లు తెలిపారు. తాగునీటి వసతి కోసం ఆవరణలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సందర్శకుల సౌకర్యార్థం బౌద్ధస్తూపం గేట్లు తీసినప్పుడు మాత్రమే స్థానికులు ఈ ప్లాంట్ నుంచి నీరు ఉచితంగా తీసుకువెళ్లవచ్చునని పేర్కొన్నారు. 20 లీటర్ల క్యాన్లతో తాగు అవసరాలకు మాత్రమే నీరు తీసుకువెళ్లాలని కోరారు.



గానుగ సున్నం ఆడించేందుకు ఉపయోగిస్తున్న మిల్లర్



స్తూపం వద్దకు వెళ్లే మార్గంలో బల్లలు

కబడ్డీ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

చినగంజాం: రాష్ట్ర కబడ్డీ చాంపియన్ షిప్ జూనియర్ బాలుర జట్టు ప్రాబబుల్స్ ఎంపిక కార్యక్రమం ఆదివారం సాయంత్రం స్థానిక ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి సుమారు 50 మంది హాజరయ్యారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు పర్యవేక్షణలో 16 మందిని ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు అంతర్జాతీయ క్రీడాకారుడు ఎం. గిరిబాబు ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ చైర్మన్ చంద్రమోహన్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు శిరిగిరి రంగారావు, ఈదర సురేష్ బాబు పాల్గొన్నారు.



నగదు బహుమతి అందిస్తున్న జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు

బహుమతి ప్రదానం

ఇటీవల సంతనూతలపాడులో నిర్వహించిన 71వ ఆంధ్ర అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల కబడ్డీ జట్టు విజయం సాధించి రూ.75 వేల నగదు బహుమతి అందుకుంది. సంతనూతలపాడు శాసన సభ్యుడు బీఎన్ విజయ్కుమార్ జట్టుకు నగదు బహుమతి ప్రకటించారు. ఆదివారం సాయంత్రం ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, ఇతర సభ్యులు జిల్లా జట్టుకు ఈ మొత్తం అందజేశారు. కోచ్ ఎం. గిరిబాబు, అంతర్జాతీయ క్రీడాకారుడు బోగిరెడ్డి సురేష్ రెడ్డి, నాగాంజనేయ రెడ్డి పాల్గొన్నారు.

బ్రాంచ్ కెనాల్లో పడిన ద్విచక్ర వాహనదారుడు





కాలవలో బైక్ను పరిశీలిస్తున్న రైతులు

- గూగుల్ మ్యాప్ చూసుకుంటూ వెళుతుండగా దుర్ఘటన
- ఈత రావడంతో సురక్షితంగా ఒడ్డుకు చేరిన బాధితుడు
- వంతెన వద్ద తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- అధికారుల అలసత్వంతో కలగానే నూతన బ్రిడ్జి నిర్మాణం
- ఇకనైనా ప్రభుత్వం స్పందించాలని 50 గ్రామాల ప్రజలు వినతి

బల్లికురవ: గూగుల్ మ్యాప్ ఆధారంగా ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకుడు ప్రమాదవశాత్తు ఏబీసీ కాలువలో పడిపోయిన ఘటన శనివారం రాత్రి జరిగింది. అద్దంకి– బల్లికురవ ఆర్అండ్బీ రోడ్డులో బైక్పై వెళుతూ సాగర్ అద్దంకి బ్రాంచ్ కాలువను దాటే చోట వల్లాపల్లి గ్రామ సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆదివారం సమీప పొలాల్లోని రైతులు అటుగా వెళ్లగా బైకు కాలువలో పడి ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బల్లికురవ పోలీసులు బైక్ను బయటకు తీసి విచారణ చేపట్టారు. ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన ప్రతాప్ పని నిమిత్తం బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ క్వారీల వద్దకు వచ్చి తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించిందని తేలింది. నీటి ప్రవాహ ఉధృతి తక్కువగా ఉండటం, ప్రతాప్కు ఈత రావటం వల్ల సమీపంలోని వల్లాపల్లి లాకులకు పట్టుకుని ఒడ్డుకు చేరాడు. అనంతరం వెనుక వచ్చిన మరో బైక్లో స్వగ్రామం చేరాడు. సింగిల్ బ్రిడ్జి కావటం, ఇక్కడే మలుపు ఉండటంతో గత పది సంవత్సరాల్లో అనేక మంది కాలువలో పడి చనిపోవడం, గాయాలపాలవడం వంటి ఘటనలు అనేకం ఉన్నాయి. ప్రమాదం జరిగినప్పుడు అధికారులు హడావుడి చేయడం తప్ప తదుపరి ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు. బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న యాంగిలర్లు కూడా పూర్తిగా వంగిపోయాయి. ఆరు సంవత్సరాల క్రితం అద్దంకి బల్లికురవ ఆర్ అండ్ బీ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించిన అధికారులు.. ఈ బ్రిడ్జిని మాత్రం అభివృద్ధి పరచలేదు. ప్రపంచ బ్యాంకు నిధులకు ప్రతిపాదనలు పంపామని కాలం వెళ్లదీస్తున్నారు. ఈ వంతెన బల్లికురవ, మార్టూరు మండలాల సరిహద్దులో ఉండటం వల్ల పోలీస్ శాఖ కూడా తమది కాదంటూ తప్పించుకుంటోంది. ఇప్పటికైనా బ్రిడ్జి వద్ద ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలని బల్లికురవ, సంతమాగులూరు, అద్దంకి మార్టూరు, పంగులూరు మండలాల్లోని 50 గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎయిమ్స్లో ముగిసిన వర్క్షాప్



వర్క్షాప్లో పాల్గొన్న ప్రతినిధులు, వైద్యులు


తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఎయిమ్స్లో రేడియో డయాగ్నోసిస్ విభాగం, అనాటమీ విభాగానికి సంబంధించి ఇమేజ్ గైడెడ్ మస్క్యులోస్కెలెటల్ ఇంటర్వెన్షన్లపై కాడెరిక్ వర్క్షాప్, శిక్షణ కార్యక్రమాన్ని రెండు రోజులపాటు నిర్వహించారు. ఇండియన్ రేడియోలాజికల్ – ఇమేజింగ్ అసోసియేషన్, ది మస్క్యులోస్కెలెటర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మధబానందకర్ మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 80 మంది ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన 10 మంది అధ్యాపకులు శిక్షణ ఇచ్చారని వెల్లడించారు. ఈ శిక్షణ పాథాలజీ చికిత్సకు కీలమని తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీమంత్ కుమార్ దాస్, డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ జైరాజ్ గోవిందరాజ్, డాక్టర్ జాయ్ ఘోషెల్, డాక్టర్ పృథ్వీనాథ్, డాక్టర్ అనిల్ కుమార్ రెడ్డి, డాక్టర్ యుగంధర్, డాక్టర్ మిథిలేష్, డాక్టర్ కిషోర్, డాక్టర్ చైతన్య, డాక్టర్ భావలు పాల్గొన్నారు.


పోరాటానికి ప్రతిరూపం పొట్టి శ్రీరాములు



లక్ష్మీపురం: పోరాటానికి ప్రతిరూపం అమరజీవి పొట్టి శ్రీరాములు అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కొనియాడారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ అతిథి గృహం వద్ద అమరజీవి విగ్రహానికి ఆయన ఆదివారం ఉదయం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ... దళితులను దేవాలయాల్లోనికి రానివ్వాలని మొదట పోరాటాన్ని ప్రారంభించిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం, తెలుగు జాతి కోసం 56 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్రంతోపాటు ఇతర భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు తోడ్పడ్డారన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ... ఆంధ్రులకు ఒక రాష్ట్రం కావాలని మద్రాస్ ప్రెసిడెన్సీలో శ్రీరాములు ప్రాణ త్యాగం చేశారని తెలిపారు. రాష్ట్రం, ప్రజలు అభివృద్ధి చెందడమే పొట్టి శ్రీరాములుకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, నగరపాల సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, పలు కార్పొరేషన్ చైర్మన్లు, కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలు





గాయపడిన నక్కా దాసు, నోవాకు

కర్లపాలెం: ఆటో బోల్తా పడిన ఘటనలో ఇరువురికి తీవ్రంగా, మరో ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని దమ్మనవారి పాలెం పంచాయతీ మోటుపాలెం గ్రామం వద్ద చోటుచేసుకుంది. కర్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఆదివారం రాత్రి నిజాంపట్నం నుంచి బాపట్ల వస్తున్న ఆటోలో ఖాజీపాలెం వద్ద నలుగురు ప్రయాణికులు ఎక్కారు. దమ్మన వారి పాలెం పంచాయతీ మోటుపాలెం గ్రామం వద్దకు రాగానే రోడ్డుపై ఉన్న రాయిపై ఆటో ఎక్కి బోల్తా పడింది. కర్లపాలెం గ్రామానికి చెందిన నక్కా దాసు, అతని కుమారుడు నోవాకుకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. దాసు, నోవాకును 108 వాహనంలో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనాథ శరణాలయం అభివృద్ధికి కృషి

మాచవరం: వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో పేదల విద్యాభివృద్ధికై ఏర్పాటు చేసిన జీవీజీకేఆర్ఓ అనాథ శరణాలయం అభివృద్ధికి శాఖాపరంగా కృషి చేస్తామని జిల్లా దేవదాయ శాఖ అధికారి కె.వీరాంజినేయులు అన్నారు. మండలంలోని పిల్లుట్ల గ్రామంలో ఈఓ జి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జీవీజీకే అనాథ శరణాలయం దాతలు గుర్రం వీరారెడ్డి, గోపాలకృష్ణారెడ్డి 102వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో దాతల చిత్రపటాలతో గ్రామోత్సవం నిర్వహించారు. దాతల సమాధుల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరాంజినేయులు మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన పిల్లుట్లలో వందేళ్ల క్రితం తమకున్న యావదాస్తిని, సుమారు 600 ఎకరాల భూమిని విద్యాభివృద్ధికి దానం చేసిన గుర్రం వీరారెడ్డి, గోపాల కృష్ణారెడ్డిల దానగుణం మరువలేనిదని అన్నారు.